


భానుమతీ రామకృష్ణ

# బండ్లు ఓడలౌ!.. ఓడలు బండ్లౌ!..

**హా**ల్లో టెలిఫోన్ మోగింది! ఫోన్ మావారి కేమో అనుకుని, పూజ గదిలో దీపాలన్నీ వెలిగించడం పూర్తిచేసి, పూజకి కూర్చో బోతూన్నా "అమ్మా! మీకు టెలిఫోన్ చేశారెవరో ఒకామె! అర్జంట్‌గా మాట్లాడా లంటున్నారు!" అని చెప్పి వెళ్లాడు మా వంటవాడు

వెళ్లి రిసీవరు తీసుకొని, "హలో!" అనే లోపలే "హలో? ఎవరూ? భానూనా? భానూ! నువ్వు అర్జంట్‌గా బయల్దేరి మా ఇంటికి రావాలి! — లేకపోతే కొంప మునిగి పోతుంది! " అని ఖంగారుపడుతూ చెప్పింది మా అత్తగారి స్నేహితురాలు అన్నపూర్ణమ్మ కోడలు భారతి అప్పటికే అర్ధమయింది

"ఏం కోడలు ట్రబులా!" అన్నాను నవ్వుతూ

"అవునూ! అది కోడలుగాదు! కొరక రానికొయ్య! నా ఒక్కగానొక్క కొడుకుని తీసుకెళ్లీ అమెరికాలోనే సెటిలవుతుందట!"

నాకు నవ్వొచ్చింది భగవంతుడి లీలలు ఎవరికీ అర్ధంకావు సరిగ్గా పద్దెనిమిదేళ్ళక్రితం ఇలాంటి ఫోనే భారతి అత్తగారు అన్నపూర్ణమ్మ మా అత్తగారికి చేశారు తన ఒక్కగానొక్క కొడుకునీ, మనవణ్ణీ తీసుకెళ్లి తన కోడలు భారతి వేరే కాపరం పెడతానంటోందని నా బుర్ర "ఫ్లాష్ బేక్"లోకి వెళ్లింది,

పద్దెనిమిదేళ్లనాడు ఇదే విధంగా టెలిఫోన్ మోగింది హాల్లో పరీక్షలకు చదువుకుంటూ కూర్చున్న మా వాడు ఫలహారానికి పిండిజల్లించు కొంటున్న మా అత్తగారితో "నానమ్మా! నీకు టెలిఫోన్ వచ్చింది నీ ఫ్రెండ్ అన్నపూర్ణమ్మ అర్జంట్‌గా నీతో మాట్లాడాలట"అని చెప్పాడు "అయ్యో పాపం! మళ్లీ కోడలు ఏం కొంప మీదికి తెచ్చిందో" అనుకొంటూ మా అత్తగారు ఫోన్ దగ్గరకెళ్లారు "హలో, అన్నపూర్ణా!" అన్నారు అవతల ఆమె ఏం చెప్పిందో "అయ్యో! ఎంత రాతి గుండె దాందీ! నీ ఒక్కగానొక్క కొడుకును తీసుకెళ్లి వేరే కాపరం పెడతా నంటూందా! అదీ అద్దె ఇంట్లోనా! ఎంత పొగరు లంకంత ఇల్లు పెట్టుకొని లక్షణంగా మీతో కలిసి ఉండకుండా" అవతల మళ్లా ఏదో చెప్పింది అన్నపూర్ణమ్మ "ఏమిటీ! నీ మన వణ్ణ గూడా నీ దగ్గర ఉంచదట్నా! ఓసి దీని అహంకారం కూలా! ఎంత పనిచేస్తోంది! సరే మధ్యాన్నం అటు వస్తాలే నా కోడలు గూడా కంటి డాక్టర్ని చూడాలంటోంది మీ ఇంటి వేపేగా రావాలి? నువ్వు కళ్లు నీళ్లు పెట్టుకోకు ముందు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో అసలే నీకు ఏదో రొమాన్‌టిక్కు నొప్పులన్నావ్"

పక్కనే చదువుకొంటున్నా మావాడు ఫక్కున నవ్వి, "రొమాన్‌టిక్ నొప్పులు కాదు, నానమ్మ! రుమేటిజం — అంటే, కీళ్ల నొప్పులు ఆమెకి" అన్నాడు "ఏదో ఎత్తు భారం పాపం! అదొక్కటేనా బ్రెడ్‌ప్లెషరూ, చక్కెరా ఆవిడ వంట్లో ఎన్నున్నాయో"

మా వాడు మధ్యలోనే మరింత గట్టిగా నవ్వుతూ, "నాటన్నిటితో ఒక 'బేకరీ' పెట్టోచ్చు, నానమ్మా అమెకుండేదీ, బ్రెడ్ ప్లెషరు కాదు 'బ్లెడ్‌ప్రెషర్,' అంటూ వాళ్ల నానమ్మను కరెక్ట్ చేస్తూంటే, రిసీవర్ పెట్టేసి

మా వాడి బుగ్గ పొడిచి, "అల్లరి గాడిదా! ఎప్పుడూ నా ఇంగ్లీషు సరిచేయడమే నీ పని పరీక్షలకి బుద్ధిగా చదువుకొని ఫస్టు మార్కులు తెచ్చుకో నీకు మంచి బహుమతి ఇస్తాను" అంటూ

"మధ్యాహ్నం అన్నపూర్ణని వెళ్లిచూద్దామే పాపం, కడవంత గుమ్మడికాయ కత్తిపీటకు లోకువైనట్లు— అన్నీ ఉండీ అన్నపూర్ణ — కోడలి చేతులో చిక్కి కుమిలిపోతోంది పాపం" అంటూ మా అత్తగారు చాలా సేపు అన్నపూర్ణమ్మ స్థితికి బాధపడ్డారు

అన్నపూర్ణమ్మకు బోలెడు ఆస్తిపాస్తులున్నాయి — భర్త రిటైర్డ్ మిలిటరీ ఆఫీసర్ రెండు మూడు పెద్ద పెద్ద బంగళాలూ, చెంగల్పట్టు దగ్గర యాభై ఎకరాల పొలమూ, తోటలూ, దొడ్లూ చాలా ఉన్నాయి పుట్టింటివారిచ్చిన వజ్రాల నగలూ, బంగారు నగలూ— కొడుకు పెళ్లయితే కోడలికి పెట్టాలని ఎన్నో కలలుగని, చివరికి పుట్టబోయే మనవలకిగూడా బుజ్జి బుజ్జి నగలు చేయించి పెట్టుకున్నది భద్రంగా అలాంటి అన్నపూర్ణమ్మగారికి ఒక నల్లటి ఏనుగుబంటులాంటి వికృతాకారం గల కోడలు వచ్చింది కొడుకు గొప్ప అందగాడు కాకపోయినా, కన్నూ,ముక్కూతీరు అన్నపూర్ణమ్మ పోలికతో బాగానే వుంటాడు ఆమెలాగే మంచి గుణవంతుడూ, మంచివాడూ నూ— అలాంటి వాడికి ఈ కోతిని ఎలా చేశారంటే, కోడలు మినిష్టరు కూతురు! బోలెడు పలుకుబడి పైగా, ఆ మినిష్టరు, అన్నపూర్ణమ్మ భర్త చిన్ననాటి స్నేహితుడు గూడా బోలెడు కట్నంతో పిల్లనిస్తూ అల్లుడికి గొప్ప ఉద్యోగం గూడా తక్షణం వేయించే ఏర్పాట్లు జరిగిపోయాయి! ఇష్టం లేకపోయినా— అన్నపూర్ణమ్మ భర్త మాటకు ఎదురు చెప్పలేకపోయింది అన్నపూర్ణమ్మ కొడకూ తల్లిదండ్రుల మాటకు ఎదురు చెప్పడు!—

కోడలు అందగత్తె కాకపోయినా గుణవంతురాలైతే చాలనుకున్న అన్నపూర్ణమ్మకు అహంకారానికి మారుపేరయిన భారతి కోడలుగా వచ్చింది! అన్నపూర్ణమ్మ అరవైయ్యో పడిలో పడ్డా అందంగా చూట్టానికి మహాలక్ష్మిలా వుంటుంది

మేము మధ్యాహ్నం వెళ్తూనే అన్నపూర్ణమ్మ ఆప్యాయంగా మమ్మల్ని హాల్లోకి తీసుకెళ్లి కూర్చోబెట్టింది నా కళ్లు అన్నపూర్ణమ్మ కోడలి కోసం వెతికాయి! . మా అత్తగారు గూడా ఆ పనిమీదే వున్నారుగాబోలు నాలుగు వైపులాచూసి "కోడలెక్కడ!' అని సౌజ్ఞతో అడిగారు! మేడమీద మేకప్ అవుతోందని అన్నపూర్ణమ్మ గారు గూడా అభినయ సౌజ్ఞతో చెప్పారు!.

వాళ్లిద్దర్నీ చూసి నాకు నవ్వొచ్చింది

"బోయ్!" అని మేడమీది నుండి ఓవెర్రి కేక వినిపించింది! ఒక్కసారి అదిరిపడ్డాం అన్నపూర్ణమ్మ గడగడలాడిపోతూ, "ఒరే, రామూ! రాజూ! నటేశా! చిన్నమ్మగారు పిలుస్తున్నారా! త్వరగా వెళ్లండి!" అంటూ పని పిల్లలకోసం అటూ యిటూ పరుగెత్తింది!

మా అత్తగారు తల బాదుకొన్నారు!

పైన ఏదో తిడుతోంది 'ఛీ ఛీ!'

కాలింగ్ బెల్లు పెట్టించలేదని తిడుతున్నట్లు అన్నపూర్ణమ్మ మా అత్తగారి చెవులో రహస్యంగా చెప్పింది

"పోనీ పెట్టించకపోయావా! నీకెందుకీ బంట్రోతు ఉద్యోగం? అది పనివాళ్లని పిలవడం నువ్వు వాళ్లకోసం పరుగెత్తడం!" అంటూ కోప్పడ్డారు మా అత్తగారు

## గణేశస్తుతి

జయ జయ జయ గణనాయక
జయ జయ శుభ దాయక
జయ వినాయకా !!

సకల సురాసుర వందిత
సిందూరారుణ రంజిత !
త్రిభువన మునిజన సేవిత
శాంభవీ శంకర సుతా !!

ఇలవేల్పు లెందరుండినా
తొలి పూజ నీదే గజాననా !
విఘ్నములణచే విఘ్నేశా
వందన శతములు లోకేశా !!

శ్రీ విద్యా వరదాయక
వాంఛిత ఫల సంధాయక !
సృష్టి స్థితిలయ కారక
వరగున వరమొసగు మిక !!

—రావులపర్తి భద్రిరాజు

"అయ్యో అమ్మణ్ణి పెట్టించాను కాని మా వారు పీకించేశారు తన తల బద్దలవుతోంది క్షణక్షణానికీ కోడలుపైనుంచి ఆ బెల్లు కొడుతూంటే", అంటూ ఒకే గోల పెట్టారు!. "నేనేం చేసేది చెప్పు! తిరగల్లో గింజలా నలుగుతున్నాను!

మా అత్తగారు రైలు ఇంజన్లా ఒక పెద నిట్టూర్పు విడిచారు ఏమీ చెప్పలేక! మళ్లీ అన్నపూర్ణమ్మే అందుకున్నది "ఆ బెల్లు పీకించేసని మా వార్ని అనరాని మాటలని, తిట్టరాని తిట్లు తిట్టి, ఎంత అవమానించిందో! కొడుక్కి చెప్తే బాధపడతాడని లోపలే కుములుతూ కొద్ది రోజులుగా మంచం దిగటం లేదు ఆయన" అంటూ కళ్ళు తుడుచుకుంది "ఛీ—ఛీ! నిండిట్లో మహాలక్ష్మిలాంటి నువ్వు కంట తడిపెట్టగూడదు ఇంతకీ అది కొండమీదే వుంటుందా?" అన్నారు అత్తగారు, కోపంకోడెతాచులా లోలోపలేబుసలుకొడుతూంటే "కొండమీద గాదు, మేడమీద వుంది!" అన్నది అర్థం గాని అన్నపూర్ణమ్మ "అదేలే. కోతి కొండమీద నీ కోడలు ఈ మేడమీద వుటకలో రెండూ ఒకటేనని అన్నా,"—అన్నారు మా అత్తగారు మండిపోతూ అంత దుఃఖంలోనూ అన్నపూర్ణమ్మకు నవ్వొచ్చి, మూతికి చెంగడ్డం పెట్టుకుంది

పై నుంచి ఒక్కసారి సెంటువాసన గుభాళించింది మరుక్షణం టక్ టక్ టక్ మంటూ అన్నపూర్ణమ్మ కోడలు మెట్లు దిగి రావడం మొదలు పెట్టింది కోడల్ని పై మెట్టు మీద చూస్తూనే ఏదో తప్పు చేసిందానిలాగా భయపడుతూ నమ్రతగా గబుక్కున లేచి నిలబడ్డాది అన్నపూర్ణమ్మ. అది చూసిన మా అత్తగారు నా వైపు గుర్రున చూశారు రేపు నువ్వు మెట్లు దిగి వస్తుంటే నేనూ లేచి నిలబడాలా అన్నట్లుంది ఆ చూపు అన్నపూర్ణమ్మ కోడలిమీద చూపించాల్సిన చురుకూ, కోపం ఆ చూపులో కనిపించాయి

అసలక్కడ కూర్చోడానికే ఇబ్బంది పడుతున్న నేను నా చూపును మరో వైపుకు తిప్పాను!

"రామ్మా!" అంటూ అన్నపూర్ణమ్మ కోడల్ని ఆప్యాయంగా ఎదురెళ్లి భయ భక్తులతో పిల్చుకొచ్చింది?

"హలో" అన్నది నావైపు చూసి అమెరికన్ స్టైల్లో మా ఎదురు సోఫాలో కాలిమీద కాలు వేసుకుని కూర్చుంది అది చూసిన మా అత్తగారికి ఒంటి మీద కారం రాచినట్లుందని ఆమె ముఖం సగం చూసే కనిపెట్టాను "బాగున్నారా?" అన్నాను

"ఏం బాగు, అందులోనూ ఈ హౌస్‌లో ఛీఛీ! చాలా ఓల్డ్‌ఫాషన్ హౌస్, మనుషులూ అంతే, నిజం చెప్పాలంటే ఐ హేట్ దిస్‌హౌస్" అన్నది కట్‌చేసిన తల వెంట్రుకలు సవరించుకుంటూ మా అత్తగారికి కొంత అర్థమైంది "అది సరేగానీ, కోడలా నీ మొహం ఎప్పుడైనా అద్దంలో చూసుకున్నావా ఏనుగు చర్మంలా ఉంది నీ మొహం మీద తోలు. దాని కంత పొడరెందుకే? పై పెచ్చు కొండముచ్చులాగా నీ

నల్లటి పెదాలకి ఎర్రటి రంగెందుకే ఎందుకీ వగటివేషం ? లక్షణంగా జడ వేసుకుని పూలు పెట్టుకో — పోనీ, నీకిష్టమైనట్లు ఫాషనే చేసుకో అయ్చొచ్చినా ఈ ఇల్లు వదిలీ, ముసలి వాళ్లయిన మీ అత్తమామల్ని వదలీ ఊర్లోనే మరో కాపరం — అదీ అద్దె ఇంట్లో పెడతానంటున్నావటే! ఇది నీకేవన్నా బాగుందా చెప్పూ ! పైగా మనవణ్ణి అయినా కనీసం అత్తమామల దగ్గర వుంచకుండా వాడినీ తీసుకు వెళ్లి ఆయాలకు అప్పగించి, నీపాటికి నీవు క్లబ్బు గిబ్బూ అంటూ తిరుగుతూంటే నీకేం ఒరుగు తుంది ఈ ఇద్దరు ముసలాళ్లూ పతుల్లాగా బిడ్డకూ, మనవడికీ గూడా దూరంగా ఉండి ఎట్లా బ్రతగ్గలరు ! చదువుకున్న దానివి ఈ మాత్రం ఆలోచించలేవా!'' అంటూ మా అత్త గారూ కంట తడిపెట్టుకుని చెపుతూంటే భారతి తోక తొక్కిన తాచు లాగా కస్సుమని లేచి, ''వాటీస్ దిస్ నాన్సెన్స్ ! నన్ను యిన్‌సల్ట్ చేయడానికేనా వీళ్లని పిలిపించావ్, ముసల్దానా ఎంత పొగరు నీకు! '' అంటూ అన్నపూర్ణమ్మ గారిమీద విరుచుకుపడ్డది మా అత్తగారూ నేనూ భయంతో బిగుసుకుపోయాం ! అన్నపూర్ణమ్మ గజగజ వణికిపోతూ కళ్లనీళ్లతో కోడలి చేతులు పట్టుకుని ప్రాధేయపడ బోయింది ...

భారతి విదిలించి కొట్టింది ''చాలు నీ నక్క వినయం అందర్నీ పిలిచి చెప్ప నే వెడ్దదాన్నని ! ఛి ఛీ మీ ముసలాళ్ల బుద్ధులు పోనిచ్చారుగాదు '' అంటూ విసురుగా పోబోతున్న భారతికి అడ్డుతగిలి అన్నపూర్ణమ్మ ''భారతీ, నామాట విని వేరే కాపరం పెట్టి మమ్మల్ని చంపెయ్యకమ్మా ! నా కొడుకునీ, మనవణ్ణి చూసుకోకుండా ఉండలేం, తల్లీ ! నా మాట విను. ఈ ఇల్లు కొన్నతర్వాతే మనకి కలిసి వచ్చింది మీరు ఈ ఇల్లు వదిలి వెళ్తే ఏమవు తుందోనని దిగులుతో భయంగావుందమ్మా!నామాట వినుతల్లీ'' అంటూ గడ్డం పట్టుకుని బ్రతిమా లుతుంటే అలాంటిఅదోగతి ఏ అత్తగారికీపట్టగూడ దనిపించింది ఆక్షణంలో అన్నపూర్ణమ్మ దయా నీయ స్థితి చూసి ! పాపం ! అన్నపూర్ణమ్మని చూస్తే మాకే కళ్లనీళ్లు ఆగలేదు ''ఎన్ని సార్లు చెప్పిందే చెప్తారు ! బోర్ కొట్టదూ ? నేను అనుకున్నది చేస్తాను అది మా కుటుంబ విషయం ! మీ ముసలాళ్ల కోసం నేను అవస్థ పడలేను సిగ్గుంటే ఇక మీద ఈ విషయం ఇంతటితో 'స్టాప్' చెయ్యండి తల క్రిందులుగా తపస్సుచేసినా మనం కలిసి వుండడం జరిగేపనికాదు వస్తా !'' అంటూ భారతి విసురుగా మళ్ళీ బూట్లు టక టక లాడిస్తూ వెళ్లి, కార్లో కూర్చుని డ్రైవ్ చేసుకొంటూ వెళ్లిపోయింది

నేనూ, మా అత్తగారూ, అన్నపూర్ణమ్మ కొయ్యబారి నిలబడిపోయాం

అన్నపూర్ణమ్మ భుజం తట్టి మా అత్తగారు ''పోనీలే ఇలాంటి అహంకారి కోడలు ఇంట్లో ఉంచుకుని ప్రతి క్షణం గుండెల మీద కుంపటి పెట్టుకున్నట్లుండేదాని కంటే అది నీకు దూరంగా ఉంటేనే మేలు, నా మాట విను ఇది నీ పాలిట శత్రువు ఇక్కడేవుంటే నిజంగానే ఏదో ఒక రోజు కోపం వచ్చినప్పుడు నీ తలకాయ బద్దలు గొట్టగలదు . ఎందుకొచ్చిన పీడ పోనిద్దూ నీ బిడ్డ ఎక్కడున్నా నీ బిడ్డే కానీ మనవడు నీదగ్గర పెరిగినవాడు వాడిని నీనుంచి దూరం చేయలేదు చూడు కావాలంటే అది వేరే కాపురం పెట్టినా నీ మనవడు నీదగ్గరికి పరు — గెత్తుకొస్తాడు అదేమన్నా పిల్లాణ్ణి పెంచిందా? ఎన్నడైనా ? వాడన్నం తిన్నాడో లేదో చూసిందా ఈ రోజు కొత్తగా కొడుకును చూసు కుంటుందా ? ఆయాల కప్పగించి దానిపాటి కది తిరుగుతుంది వాడు నిన్నొదలి ఉండడు చూడు చూద్దాం రేపు దీనికీ వస్తుందిగా కోడలూ. ''అయ్యో! అమ్మణ్ణీ! నా మనవడు బంగారం లాంటివాడు వాడికిలాంటి కొరివి భార్యగా రాకూడదు నేను బ్రతికుంటే నా మనవడికి మంచి పిల్లను చూసి పెళ్లి చేయిస్తాను మా వారు చేసిన యీ తప్పు పగవాళ్ళు కూడా వేయగూడదు'' అంటూ వెక్కివెక్కి ఏడ్చింది— అన్నపూర్ణమ్మ

అనేక విధాల మా అత్తగారు ఆమెను ఓదార్చి, భగవంతుడు పరిస్థితులను ఎప్పుడూ ఒకే విధంగా వుంచడనీ, బంధ్నలు ఓడలయితే ఓడలు బండ్లు గూడా కావచ్చనీ, భారతి కూడా ఒక నాడు అత్తగారుగా తను పెట్టిన అవస్థలకి గుణ పాఠం నేర్చుకోబోతుందనీ, మనసు కుదుట పరుచుకుని ధైర్యంగా వుండమనీ, అసలే మంచం పట్టిన భర్తను భద్రంగా చూసుకోమనీ చెప్పి బయల్దేరి, సాయంకాలానికి ఇల్లు చేరాం

(ఇంకా ఉంది)

## నిరీక్షణ


**— శ్రీమతి మాచిరాజు సావిత్రి**

ఏదో కావాలి
ఎవరో రావాలి
''అది'' ఏమిటో
''వాడు'' ఎవ్వరో
తెలియని ఈ బ్రతుకెందుకో ?

వెతకాలి ''దానిని'' ఎక్కడో
వెలుతురులోనో చీకటిలోనో
పిలవాలి ''వాడి''ని ఎప్పుడో
మరి ఇప్పుడో ఇంకెప్పుడో
ఎక్కడని చూసేది ? ఎప్పుడని పిలిచేది ? అది
తెలియని ఈ బ్రతుకెందుకో ?


వెతకిన వెంటనే దొరికెనో — ''అది'' ?
పిలచిన వెంటనే వచ్చెనో — ''వాడు'' ?
తెలిసీ తెలియని — తెలియక తెలిసిన
తెలుసో తెలియదో — అదియే
తెలియని ఈ బ్రతుకెందుకో ?

వెతికీ విసిగీ, పిలిచీ అలిసీ
ఊరుకున్నాను — మానుకున్నాను — ఇక
''అదీ'', ''వాడూ'' కలిసి నన్ను
వెతికి రావాలి — నేను వేచి యుండాలి
ఎదురు చూడాలి — అపుడు
తెలియాలి ఈ బ్రతుకెందుకో



# బండ్లు ఓడలూ!.. ఓడలు బండ్లూ!..

## భానుమతీ రామకృష్ణ




(గత సంచిక తరువాయి)

ఆ తర్వాత అన్నపూర్ణమ్మ కోడలు వేరే కాపురం పెట్టడం, అన్నపూర్ణమ్మ ఇంటి నుంచే ప్రతి రోజూ పాలూ, నెయ్యీ మొదలుకుని అన్నీ చివరకు మనవడికీ, కొడుక్కీ ఇష్టమైన పాలకోవా బాదంకోరుదాకా ఆప్యాయంగా చేసి పనివాళ్లకిచ్చి కార్లో పంపించేది. అప్పుడప్పుడూ వెళ్లి కొడుకునీ, మనవణ్నీ చూసి వచ్చేది. శని, ఆదివారాలలో మనవడు నానమ్మ దగ్గిరే ఉంటానని పట్టుబట్టి వచ్చి ఉండడం మొదలు పెట్టాడు. అలాగే అన్నపూర్ణమ్మ కొడుకు ఆఫీసు వదిలిన తర్వాత భార్యకు తెలీకుండా తల్లిదండ్రుల్ని తరచు చూసివెళ్తూ, తండ్రికి మందులూ, టానిక్కులూ కావాల్సినవి తెచ్చి ఇచ్చేవాడు. నెమ్మదిగా అన్నపూర్ణమ్మ మనసు కాస్త ఊరటజెందుతూ వచ్చినా భర్త ఆరోగ్యం పరిస్థితి నానాటికీ విషమించింది. యింత సంపాదించీ, పేరు ప్రతిష్టలుండీ — కొడుకూ, కోడలూ వేరే కాపరం అద్దె ఇంట్లో పెట్టడం ఆయనకు నయంగాని మనోవ్యాధిగా పరిణమించిందని ఏడ్చేది అన్నపూర్ణమ్మ. చివరకు అన్నపూర్ణమ్మ భర్త పోయాక మనవడు అరవింద్, తండ్రితో మాట్లాడి తల్లిని ఒప్పించి, నాయనమ్మ దగ్గిరే వుండే ఏర్పాటు చేశాడు. కాలేజీకెళ్తున్నప్పటికీ అరవింద్, అన్నపూర్ణమ్మకు ఏం కావాలో అతి శ్రద్ధగా కూరగాయలు మొదలుకొని పనివాళ్లున్నా తనే సైకిల్‌పై నాయనమ్మకు నచ్చినవన్నీ తెచ్చేవాడు. అన్నపూర్ణమ్మ ఆనందపడుతూ ఫోన్లో మా అత్తగారితో చెప్పేది. కొడుకూ కోడలూ తిరిగి వచ్చినా ఇంట్లో పెట్టీపెట్టనట్లుండేది భారతి! కొడుకు భారతికి భయపడి చాటుగా తల్లి యోగక్షేమం చూసేవాడు! విధిలేక పుట్టింటివాళ్లు చీవాట్లుపెట్టి పంపితే మళ్లీ అన్నపూర్ణమ్మ ఇంటికొచ్చిందేగాని ఆ ఇంట్లో క్షణం వుండేదికాదు!

అలాంటి అన్నపూర్ణమ్మ కోడలు భారతి అత్తగారై నేనూ అత్తగారైన తర్వాత భారతిని చూట్టం పడనేలేదు. అరవింద్ పెళ్ళిలో కలుసుకున్నాం. మా అబ్బాయి పెళ్ళిలో కలుసుకున్న తర్వాత చాలా కాలం తర్వాత భారతి ఫోన్ చేయడం; అదీ కోడలిమీద కంప్లయింట్‌తో. నాకు గతం అంతా బుర్రలోకొచ్చి తేరుకొనేసరికి చాలాసేపు పట్టింది.

ఇంతసేపూ భారతి ఏదో కోడల్ని గురించి చెప్తూనే వుంది. కాని, భారతి ఒకప్పుడు అత్తగార్ని పెట్టిన అవస్థలు ఆలోచిస్తూ నేను భారతి చెప్పేది చెవినే వేసుకోలేదు. అంతవరకూ ఏం చెప్పిందో వినని నేను ''పెళ్లాం మాట విని అరవింద్ దాని ఇష్టానికి తైతక్కలాడుతున్నాడు!...'' అంటున్న భారతి మాటలు విని, నాకు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వొచ్చింది. ''హిస్టరీ రిపీట్స్ ఇట్ సెల్ఫ్,'' అన్నాను.

''వాట్! అంటే— నా కోడలు చేసేది నాక్కావాల్సిందే అంటావా?'' అన్నది ఉక్రోషంతో.

''అబ్బే! అలా అనలేదూ. అరవింద్ బుద్ధిమంతుడు గదా! అంత అవివేకంగా నడుచుకోడే అన్నాను... అంతే ...''

''అదంతా నాకు తెలీదు. వాళ్ళు నువ్వు రావాలంటున్నారు మధ్యవర్తిగా. నేను మాట్లాడగూడదట! నువ్వు వచ్చి న్యాయం చెప్పాలట. ఏది ఏమైనాసరే — నేను వాళ్లను అమెరికా వెళ్లనివ్వను! అంతగా వస్తే వాళ్ల కాళ్లూ చేతులూ విరగ్గొట్టిపడేస్తానుగాని, వాళ్లను గడప దాటనివ్వను తెలుసా? — నేను మా అత్తగార్ని కాను — నేను అనుకున్నది చేస్తాను!'' అంటూ ఇంకా అహంకారం చావని భారతి ఆవేశంతో చెప్తూంటే—

''మధ్య నాకేమిటీ విషమపరీక్ష!'' అన్నాను.

''అరవింద్‌కి నువ్వంటే ఎంత అభిమానమో తెలుసుగా! 'ఆంటీ రావాలి. అప్పుడే నే మాట్లాడుతా నీతో', అని మొండిపట్టు పట్టాడు. అదీ నేనే పిలవాలట నిన్ను. అందుకే అర్జంట్‌గా ఈ విషయం అటో ఇటో తేల్చడానికే నిన్ను రమ్మంటుంది. మా అత్తగారూ, వాడూ, అదీ ఒకటి! మావారు నోరెత్తరు!''

నాకు నవ్వొచ్చింది ... ఆయనెప్పుడెత్తాడు గనక నోరు! పాపం భారతి చెప్పింది వినడానికే అలవాటుపడ్డ భారతి మొగుడి నోరు ఏ నాడో మూతబడ్డాది!...

''పోనీ నువ్వు వాళ్లతో అమెరికా వెళ్లరాదూ! అలా దేశాలు చూట్టం మోడరన్ లైఫ్ అంటే నీ కిష్టం కాదా?''

''నే నక్కర్లేదట! వాళ్ల నాయనమ్మని తీసుకెళ్తారట!... నేను కావాలంటే పుట్టింటికెళ్లచ్చట! లేకపోతే మరో అద్దె ఇల్లు తీసుకుని బాడుక్కుండచ్చట! చూశావా పొగరు!... దీని కంతటికీ మా అత్తగారి సపోర్టు గూడా

వుందని నా అభిప్రాయం వెనక నుంచి ! ... నా మీద పాత కసి తీర్చుకోవడానికే ఈ పన్నాగం పన్నిందేమో ?'' అంటూ భారతి చెపు్తంటే, పాపం అన్నపూర్ణమ్మగారి ఫ్రెండ్ మా అత్తగారు గూడా లేరే ఆమెను సపోర్ట్ చేయడానికి అనిపించింది.

''సరే ఇప్పుడేం చేయాలట నేనొచ్చి ? ఇది మీ కుటుంబ సమస్య గదా ? అరవింద్ చిన్న పిల్లవాడుకాడు. పైగా భార్య తెలివైందటు న్నావు గదా ! నీవు అన్నీ తెలిసిందానివి. మధ్య నేనొచ్చి ఏం చెయ్యగలను !''

''అదంతా నాకు తెలీదు! అరవింద్ ఆంటీ రానాలి నువ్వే పిలవాలి అంటూ పట్టుబట్టాడు ఎందుకో !''—నాకిప్పుడు అర్థమైంది ! భారతి కొడుకు అరవింద్ ఒకప్పుడు తన తల్లి అన్నపూర్ణమ్మను పెట్టిన అగచాట్లు గుర్తుంచుకొని, తల్లికి బుద్ధిచెప్పడానికే భార్యను సపోర్టు చేస్తున్నాడని తోచింది !

''సరే... వస్తానని అరవింద్‌తో చెప్పు'', అంటూ ఫోన్ పెట్టేశాను.

సాయంకాలం నేను ఒక్కత్తెనే అన్నపూర్ణమ్మ ఇంటికివెళ్లేసరికి భారతి బయట వరండాలో నా కోసం కాలుకాలిన పిల్లిలా అటూ ఇటూ పచార్లు చేస్తోంది.

ఇంకా మొహం నిండా పౌడరూ, లిప్‌స్టిక్కూ మా అత్తగారు చెప్పిన పగటి వేషంలోనేవుంది భారతి అంత వయసు వచ్చినా ! ...

# బండ్లు ఓడలూ...

కారుదిగి వరండాలోకెళ్తూనే భారతిని ఓవర్‌టేక్ చేసి అరవింద్, అతని భార్య అరుణా పరుగెత్తుకొచ్చి నా కాళ్ళకు నమస్కారం చేశారు.

''రండి, ఆంటీ ! మా పెళ్లయిన తర్వాత మీరిదే రావడం కదూ ?'' అన్నాడు అరవింద్.

''అవును, బాబూ ! అన్నట్లు నాయనమ్మగారూ, నాన్నగారూ బాగున్నారా ?'' అన్నాను.

''ఓయస్ ! నానమ్మకిప్పుడు నేనే బాడీగార్డ్ ! నా భార్య నర్స్‌గా పని చేస్తుంది నానమ్మకు !'' అని అరవింద్ చెపు్తంటే వినలేక ముఖం ముడుచుకుని ఉక్రోషంతో చరచర లోపలికి వెళ్లిపోయింది భారతి !

భారతి అటు వెళ్తూనే అరవింద్ నా చెవి దగ్గరకొచ్చి, ''ఆంటీ ! మీరు నాకో సహాయం చేయాలి,'' అన్నాడు రహస్యంగా.

''ఏమిటి, బాబూ !'' అన్నాను నేనూ మెల్లిగానే.

''మా అమ్మ అహంకారం ఈ జన్మకి తగ్గేట్టు లేదు ! ... మా తాతగారు పోవడానికీ, మా నాయనమ్మ ఆరోగ్యం పాడవడానికీ మా ఇంట్లో శాంతి లేకపోవడానికీ, మా అమ్మే కారణం అని మీకు తెలుసు గదా ?...''

''తెలుసు !''...

''యిప్పటికీ ఆమెకు బుద్ధిరాలేదు సరిగదా మా నాయనమ్మ మీద ఎలా అధికారం చెలాయించిందో కోడలిగా, ఇప్పుడు తను అత్తగారిగా నా భార్యమీద అదే విధంగా చెలాయిస్తూ అరుణను చాలా అవమానిస్తూ, మా ఇద్దర్నీ అయిదు నిమిషాలు సంతోషంగా ఉండనివ్వకుండా ఎప్పుడూ ఇంట్లో తగాదా పెట్టుకుంటోంది – కారణం మీకూ తెలుసు. తను చూసిన ఎవరో మినిష్టరు కూతుర్ని నేను చేసుకోకుండా మా నాయనమ్మ చూసిన బీద కుటుంబం పిల్లని చేసుకొన్నానని పెళ్ళయి నప్పట్నుంచీ కారాలూ మిరియాలూ నూరోంది మా మీదా, నాయనమ్మ మీదా ...

అవన్నీ చెప్పాలంటే చాలా ఉన్నాయి. మీకు తెలుసు మా అమ్మ స్వభావం. ఎంత భయంకరంగా ఉంటుందో ఆమెకు కోపం వస్తే !... మా నాయనమ్మ ఈ దిగుల్తో మళ్ళీ మంచాన పడేట్లున్నది. అందుకని నేను మా అమ్మకి స్ట్రాంగ్‌గా గుణపాఠం నేర్పించాలనుకున్నాను !... అందుకే అమెరికా ప్రయాణం. అర్థమైందా, ఆంటీ ?''

''ఆహా !'' అన్నాను అరవింద్ బుద్ధిబలాన్ని మెచ్చుకొంటూ ...

''మా అమెరికా ప్రయాణం అసలు నిజమైంది !'' అని అరవింద్ ఏదో చెప్పబోతూండగానే భారతి వచ్చేసింది తుఫాన్‌లాగా.

''అదుగో మళ్లీ మొదలెట్టాడు అమెరికా ప్రయాణం అంటూ ! ఎంత పొగరు !... తల్లిని కాదని ఈ దాభముఖాన్ని తీసుకెళ్తాట్ట


ఆంధ్రసచిత్ర వారపత్రిక
వజ్రోత్సవం జరుపుకొంటున్న సందర్భంగా
మా శుభాకాంక్షలు !
★
ఎమ్మిగనూరు
బ్రాందీ షాపు
అసోసియేషన్

| | | |
|---|---|---|
| సర్వశ్రీ | M. శంకరప్ప | సెక్రటరీ |
| | నద్దీముల్లా | మెంబర్ |
| | సత్యనారాయణరెడ్డి | ,, |
| | రాజశేఖరరెడ్డి | ,, |
| | మహమ్మద్ | ,, |
| | దేవప్ప | ,, |

ఆంధ్రసచిత్ర వారపత్రిక
వజ్రోత్సవం జరుపుకొంటున్న సందర్భంగా
మా శుభాకాంక్షలు !

విజయా వైన్స్
కడప

అమెరికా !... హయ్యో ఖర్మ !... యోగ్యతలేని దరిద్రగొట్టు పీడా ! కోడలని చెప్పకోడానికే నాకు సిగ్గుగా ఉంది !...'' అంటూ అరుణని చూసి తల బాదుకొంది భారతి.

''అసలు నీలాంటి భూతాన్ని అత్తగారని చెప్పకోడానికే నా కవమానంగా ఉంది — ఖర్మ!'' అంటూ భారతిని చూసి అరుణ తల బాదుకొంది !...

అహం దెబ్బతిన్న భారతి, ''ఏం కూశావే పల్లెటూరి దోసకాయతొక్కా !...'' అంటూ లేచింది.

''నీవు అత్తగారి స్థానానికే అర్హత లేనిదాని వన్నానే, పట్నవాసం డొక్కా !'' అంటూ లేచింది అరుణ.

''మాటలు జాగ్రత్తగా రానీ'' అన్నది భారతి అరుణని బెదిరిస్తూ.

''నీ మాటలూ జాగ్రత్తగా రానీ !''

''ఓహో ! అందాకా వచ్చావా ?''

''ఎప్పుడో వచ్చాను !''

''ఎంత కొవ్వు !''

''ఎంత అహంకారం !''

''నోర్మూయ్ ! నేనెవరనుకుంటున్నావ్ ?''

''దేవత లాంటి అత్తగారి పాలిటి దెయ్యం అనుకుంటున్నాను...''

''ఏం కూశావ్ ?''

''కూశేది పక్షి !''

''అవునే దరిద్రపక్షీ ! నన్నెదిరించి మాట్లాడ్డానికి నీ కెన్ని గుండెలుండాలి ?''

''ఒకే గుండె చాలు !''

''నోర్మూయ్ ! మాటకు మాట సమాధానం చెప్తావా? మళ్లీ నోరెత్తావంటే చెప్ప తీసుకుని మూతిపళ్లు రాలగొడతాను !'' అంటూ కాలి చెప్ప చేతిలోకి తీసుకున్నది భారతి.

''నీ ఈ అహంకారం తగ్గించుకోక పోయావంటే చెప్పలేకుండానే నీ పళ్లు రాలగొడతాను !'' — అన్నది అరుణ ఒక అడుగు ముందుకువేస్తూ.

''ఏమిటే ! నా పళ్లు రాలగొడతావా ? ఎన్ని గుండెలే నీకూ! ఏదీ? కొట్టూ చూస్తాను! కొట్టవే !'' అంటూ అరుణమీదికి దూకింది భారతి.

ఠపీమని అత్తగారి చెంప అదరగొట్టింది అరుణ. ఆ దెబ్బతో భారతి ముప్ఫయి రెండు కట్టుడుపళ్లూ కిందపడ్డాయి ! కోడలు అంత పని చేస్తుందని ఎదురుచూడని భారతి బోసి నోరు తెరిచి కొయ్యబారి నిలబడిపోయింది !

అత్తగారి దగ్గర్నుంచి అందర్నీ ఏడిపించడమేగాని, ఎన్నడూ ఏడ్చి ఎరగని భారతి, ఆ సమయంలో ఒక్కసారి వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టింది... తెగిందాకా బిగించి ఆ పరిస్థితి కొచ్చిన భారతిని చూస్తే జాలివేసింది !

నేను మాట్లాడకుండా అరవింద్ చెప్పింది గుర్తించుకుని చూస్తూ నిలబడ్డా — అరుణ వంగి కిందపడ్డ భారతి కట్టుడుపళ్లు తీసి భారతి చేతికిస్తూ !

''మై డియర్, అత్తగారూ ! ముందు మీ చేతిలో ఉన్న చెప్ప కాలికి వేసుకోండి ! ఇంకెప్పుడూ ఎవరిమీదికీ ఇలా వెళ్లకండి ! రాజకీయాలు తెలీని మినిష్టర్లు అధికారాన్ని అర్థం లేకుండా చెలాయించినట్లు మీ అహంకారంతో ఈ కుటుంబంలో చాలా అనర్థాలు జరిగాయి ! ... ఇకమీద అలా జరగడానికి లేదు. ఇన్నేళ్లూ స్వర్గంలా వుండాల్సిన ఈ ఇల్లు నరకంలా తయారయింది మీ వల్ల ! ... నా భర్త చిన్నప్పట్నుంచీ, మీ దెబ్బలాటల్తో కూడిన అశాంతిలో ప్రతిక్షణం టెన్షన్‌లో పెరిగారు. ఆయన గతి మాకు పుట్టబోయే బిడ్డకు పట్టగూడదనే ఒక నిర్ణయానికొచ్చాం ! ... మీరు ఈ ఇంటి కోడలిగా, తల్లిగా, అత్తగారిగా మీ బాధ్యత మీకు ఇంకా తెలీలేదని, మీకు తెలియజేసే బాధ్యత నా కప్పగించారు మీ అబ్బాయి ! ఈరోజు నుంచీ నేను చెప్పేది మీరు వినక తప్పదు !... అదేం పెద్ద కష్టమైంది కాదు... చాలా సింపుల్ !... మీరు క్లబ్బులూ, మీటింగులూ, షికార్లూ పూర్తిగా తగ్గించుకోవాలి!... మీ అత్తగార్నీ,మా మామగార్ని మీరు ఆదరణతో చూసుకోవాలి — ఒకప్పుడు మీరు అత్తగార్నీ, మామగార్నీ పనివాళ్ల పాలబడేసి ఒక్కగానొక్క కొడుకును ఆయాల కప్పగించి క్లబ్బులూ, షికార్లూ కెళ్లినట్లు నేను వెళ్లను—

''నేను బీద ఇంటిదాన్నయినా కుటుంబాన్ని కూడగట్టుకుని అందరం సంతోషంగా కలిసి ఉండాలనుకొనే దాన్ని. ఇంటి పనీ, వంట పనీ పనివాళ్లు లేకుండానే నేను చేయగలను — మీకేం కావాలో గూడా నేను చూసుకుంటాను !...''

''ఊహూ నాకేమొద్దు !'' అన్నది దెబ్బతో హడలిపోయిన భారతి... నాకు నవ్వొచ్చి ఆపుకొన్నాను.

''నే చెప్పింది మీరు సరిగ్గా చేస్తున్నారా లేదా అని చూట్టానికి ఒక మనిషిని పెట్టాను... ఓబ్‌లెన్స్ !'' అని కేకేసింది అరుణ.

ఒక నల్లటి నీగ్రో ఆడది పీపాలాగా వచ్చి నిలబడ్డది చేతులో పెద్ద కర్ర పట్టుకుని.

దాన్ని చూసి బావురుమని ఏడుస్తూ వచ్చి భారతి నన్ను కావలించుకుంది.

నేనిక ఊరుకోడం బాగాలేదని, ''అరుణా, ఇక చాలు నాటకం !...భారతి ఇకమీద మీ అందరి మనసులకూ నచ్చే విధంగా నడుచుకుంటుంది ! ఎంతయినా ఈ ఇంట్లో భారతి తర్వాతనేగదా మీరంతా !... ముందా ఓబ్‌లెన్స్‌ని బయటికి పంపించెయ్, అరుణా !'' అన్నాను.

ఓబ్‌లెన్స్‌ని పొమ్మని చెప్పి, అరుణ వచ్చి భారతి కాళ్లు పట్టుకుని కన్నీళ్లతో ''అత్తయ్యా నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి! మన యింట్లో మళ్లీ అందరం కలిసి సంతోషంగా వుండాలనే మీ అబ్బాయి ఇదంతా చేశారు'' అంది.

ఆనందంతో నా కండ్లల్లో నీళ్లు తిరిగాయి ! అత్తా కోడళ్లను లేవదీసి చెరోపక్కా నిలబెట్టుకున్నాను ! ''నానమ్మా ! నాన్న ! త్వరగా రండీ !'' అంటూ ''ఆంటీ ! అలాగే ఉండండి'' అని చేతిలో ఉన్న కెమెరాతో పరుగెత్తుకొచ్చాడు అరవింద్ సంతోషంతో ! ''ఇదుగో వచ్చేశాం, బాబూ !'' అంటూ ఎన్నడూలేని సంతోషంతో అన్నపూర్ణమ్మ కొడుకుతో సహా వచ్చి మా పక్క నిలబడ్డారు. ''స్టడీ ప్లీజ్ ! క్లిక్ !'' అన్నాడు అరవింద్.

అంతా నవ్వాం. ''అలాగే నవ్వుతుండండి... స్టడీ ప్లీజ్ ! క్లిక్ !'' అని మరో ఫోటో కూడా తీశాడు అరవింద్ !

నేను అన్నపూర్ణమ్మగారి కాళ్లకు నమస్కరించాను. నన్ను కావాలించుకున్నది ! అదే సమయంలో భారతి అన్నపూర్ణమ్మగారి కాళ్ల మీద పడి ''నన్ను క్షమించండి!! అత్తయ్యా !'' అంటూ ఏడ్చింది.

''ఛీ ! పిచ్చిదానా ! లేవే !'' అంటూ కోడలిని ప్రేమగా లేవదీసి భారతి కండ్ల నీళ్లు తుడిచింది.

''థ్యాంక్యూ, ఆంటీ ! పదండి...అందరం కలిసి అలా సరదాగా వెళ్దాం'' అంటూ అరవింద్ కారు వైపు నడిచాడు. ●

